సాక్షి
నంద్యాల
బుధవారం । 17 । మే । 2023



లా యూనివర్సిటీకి స్థల పరిశీలన

కల్లూరు: లక్ష్మీపురం పరిధిలో లా యూనివర్సిటీ నిర్మాణానికి జాయింట్ కలెక్టర్ ఎన్. మౌర్య మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. జేసీ వెంట తహసీల్దార్ రమేష్‌బాబు తదితరులు ఉన్నారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల నిత్యాన్నదాన పథకానికి మార్కాపురానికి చెందిన జె.రాఘవరెడ్డి రూ.1,01,000 విరాళంగా అందజేశారు. దాతను స్వామివార్ల జ్ఞాపికతో సత్కరించారు.



నేడు విద్యుత్ అధికారుల సమీక్ష

కర్నూలు(రాజ్‌విహార్): ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో బుధవారం సీఎండీ సంతోషరావు సమీక్ష చేపట్టనున్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఆయన కర్నూలు చేరుకున్నారు.

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి

నంద్యాల: ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో ఇంటర్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి 34 పరీక్ష కేంద్రాల్లో 14,391 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులకు కేటాయించిన విధులు బాధ్యతాయుతంగా చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, ఆర్ఐఓ గురువయ్య శెట్టి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే వెనక్కు పంపండి



బానుముక్కల యూపీ పాఠశాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ

పాములపాడు: జగనన్న విద్యా కానుక ప్రతి కిట్‌ను పరిశీలించి, వాటిలో ఏదైనా నాణ్యత లోపించినట్లు కనిపిస్తే వెనక్కు పంపాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏఎస్‌ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తహసీల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రైతు భరోసా కేంద్రాలను, బానుముక్కల ఎంపీయూపీ పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాల వద్ద ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని అధికారులకు సూచించారు.

26లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

కర్నూలు(సిటీ): జిల్లాలో 2021–23 బీఎడ్ రెగ్యులర్ బ్యాచ్ రెండవ సెమిస్టర్ పరీక్షలకు ఈనెల 26వ తేదీ లోపు ఫీజు చెల్లించాలని మంగళవారం డీఈఓ రంగారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులతో పాటు గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులు ఫీజులు చెల్లించవచ్చన్నారు. రూ.50 రుసుముతో ఈనెల 30వ తేదీ వరకు చెల్లించవచ్చని, 4 నుంచి 6 సబ్జెక్టులకు రూ.150, మూడు సబ్జెక్టులకు రూ.140, రెండు సబ్జెక్టులకు రూ.120, ఒక సబ్జెక్టుకు రూ.100 ప్రకారం బుధవారం నుంచి ఫీజు చెల్లించవచ్చన్నారు.

కేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీసు

కర్నూలు(సెంట్రల్): నగరంలోని కేవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇందిరాశాంతికి కలెక్టర్ డాక్టర్ జి.సృజన మంగళవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. డిగ్రీ కళాశాల ఆవరణలో జూనియర్ కళాశాలకు రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ ఆమె కేటాయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీనిపై రిటైర్డ్ ప్రిన్సిపల్ చెన్నయ్య స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఆదేశాలను ఎందుకు అమలు చేయడం లేదో నోటీసు అందిన మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని కలెక్టర్ ఆమెను ఆదేశించారు.

ఖరీఫ్‌కు సిద్ధం

- జిల్లాలో 2.28 లక్షల హెక్టార్లలో సాగు లక్ష్యం
- సీజన్‌కు ముందే ఎరువులు, విత్తనాలు సిద్ధం
- ప్రతిపాదనకు మించి 83,246 మెట్రిక్ టన్నుల ఎరువులు కేటాయింపు
- 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు, 30 శాతం సబ్సిడీతో విత్తనాల పంపిణీ

ఓ వైపు రైతులు వేసవి దుక్కులు దున్ని పొలాన్ని ఖరీఫ్‌కు సిద్ధం చేసుకుంటుండగా.. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం ఎరువులు, విత్తనాల కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. అవసరమైన మేర అన్నదాతకు అందుబాటులో ఉంచేలా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. గత ఏడాది డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని ఎక్కడా సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ప్రతిపాదనలకు మించి విత్తనాలు, ఎరువులు కేటాయించడంతో అధికారులు పంపిణీకి సర్వం సిద్ధం చేసుకుంటున్నారు.

కోవెలకుంట్ల: వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతకు అన్ని విధాలా అండగా నిలుస్తోంది. విత్తనం మొదలుకొని పంట ఉత్పత్తులు విక్రయించే వరకు రైతులను అనేక విధాలుగా ఆదుకుంటోంది. వచ్చే నెల నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండటంతో వ్యవసాయంలో మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. అందుకనుగుణంగా ప్రభుత్వం సీజన్‌కు ముందే ఆ పంటలకు సంబంధించి విత్తనాలు, రసాయన ఎరువులను సిద్ధం చేసింది. గత ఏడాది ఖరీఫ్‌లో వాతావరణం అనుకూలించి వరి, మినుము, మొక్కజొన్న, మిరప, తదితర పంటల్లో ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడంతో ఈ ఏడాది రెట్టింపు ఉత్సాహంతో సన్నద్ధమవుతున్నారు. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 2.28 లక్షల హెక్టార్లలో వరి, పత్తి, మినుము, కంది, ప్రొద్దుతిరుగుడు, జొన్న, మొక్కజొన్న, పెసర, మిరప, ఉల్లి, వేరుశనగ, ఆముదం కొర్ర, తదితర పంటల సాగు చేయనున్నారు. కాగా ఈ ఏడాది రైతు భరోసా కేంద్రాల ద్వారా రసాయన ఎరువుల సరఫరాకు 50 వేల మెట్రిక్ టన్నుల మేర జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఎరువుల సరఫరాలో ప్రైవేట్ డీలర్ల అక్రమాలకు చెక్‌పెడుతూ ప్రభుత్వం ప్రైవేట్ డీలర్లకు ఎరువుల కోటాను పూర్తిగా తగ్గించింది. అధిక శాతం ఆర్‌బీకేల ద్వారా సరఫరా చేసేందుకు శ్రీకారం చుట్టింది. ప్రతిపాదనలకు మించి 83,246 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్, ఎస్ఎస్‌పీ ఎరువులను కేటాయించింది. మొదటి విడత ఎరువులను ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. అలాగే రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసేందుకు సీజన్‌కు ముందే సబ్సిడీపై విత్తనాలను అందుబాటులో ఉంచింది. 9,095 క్వింటాళ్ల కంది, మినుము, పెసర, వేరుశనగ, జీలుగ, పిల్లిపెసర విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందజేస్తున్నారు. పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం, మిగిలిన రకాల విత్తనాలను 30 శాతం సబ్సిడీతో రైతులకు సరఫరా చేయనున్నారు. రైతులు రసాయన ఎరువులు, విత్తనాల కోసం ఆయా రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు.



రైతు భరోసా కేంద్రంలో విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు

మిరప, వరి సాగుపైనే ఆశలు..

గత ఏడాది ఖరీఫ్‌లో సీజన్‌లో సాగు చేసిన వివిధ పంటల సాగు రైతులకు అన్ని విధాలా కలిసొచ్చింది. మిరప, వరి, పత్తి, మొక్కజొన్న సాగులో ఆశించిన స్థాయిలో దిగుబడులు లభ్యమయ్యాయి. జిల్లాలో 7,131 హెక్టార్లలో మిరప సాగు కాగా రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, సాగునీరు, కూలీలు, కోత, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. లక్ష నుంచి రూ. 1.50 లక్షల వరకు వెచ్చించారు. వాతావరణం అనుకూలించి ఎకరాకు 25 నుంచి 28 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. మార్కెట్‌లో క్వింటా రూ. 23 వేల ధర పలకడంతో పెట్టుబడులు పోనూ రైతులకు నికర ఆదాయం చేకూరింది. గత ఖరీఫ్‌లో మిరప సాగు అన్ని విధాలా అనుకూలంగా మారడంతో ఈ ఏడాది రెట్టింపు విస్తీర్ణంలో సాగయ్యే సూచనలు ఉన్నాయి. అలాగే జిల్లాలో 67,890 హెక్టార్లలో వరి సాగు కాగా ఎకరాకు 40 బస్తాల దిగుబడులు వచ్చాయి. ప్రభుత్వం సాగుకు ముందే క్వింటా రూ. 2,060 మద్దతు ధర ప్రకటించడంతో రైతులకు వరిసాగుతో అదృష్టం వరించింది. ఈ ఏడాది మిరప, వరితోపాటు మొక్కజొన్న, పత్తి పంటల సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇప్పటికే పొలాలను సిద్ధం చేసుకుని విత్తనానికి సమాయత్తమవుతున్నారు.



ఆర్‌బీకేకు చేరుకున్న ఎరువులను చూపుతున్న సిబ్బంది

ఆర్‌బీకేలకు కేటాయించిన ఎరువులు

ఎరువు రకం	కేటాయింపు (మెట్రిక్ టన్నులు)
యూరియా	43,975
డీఏపీ	10,404
ఎంఓపీ	1,206
కాంప్లెక్స్	27,087
ఎస్ఎస్‌పీ	573

జిల్లాకు కేటాయించిన విత్తనాలు..

విత్తన రకం	కేటాయింపు (క్వింటాళ్లు)
జీలుగ	4,675
వేరుశనగ	3,560
పిల్లిపెసర	225
మినుము	100
కంది	50
పెసర	20

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండటంతో వివిధ రకాలకు చెందిన 488 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. కంది, మినుము, పెసర, వేరుశనగ, తదితర విత్తనాలను 30 శాతంతో, జీలుగ, పిల్లిపెసర విత్తనాలను 50 శాతం సబ్సిడీతో రైతులకు అందజేస్తున్నాం. సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. – కృష్ణమోహన్‌రెడ్డి, ఏడీఏ, కోవెలకుంట్ల

మూడు ఎకరాల్లో మినుము సాగు



నాకున్న మూడు ఎకరాల పొలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో మినుము పంట సాగు చేసేందుకు పొలాన్ని సిద్ధం చేసుకుంటున్నాను. గత ఏడాది మినుము సాగు చేయగా వాతావరణం అనుకూలించి ఎకరాకు 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో సరైన గిట్టుబాటు ధర ఉండటంతో పెట్టుబడులు పోనూ ఆదాయం చేకూరింది. – వెంకటేశ్వర్లు, రైతు, జోళదరాశి, కోవెలకుంట్ల మండలం


ఆర్‌బీకేలో రిజిస్ట్రేషన్ చేసుకున్నా



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నాకున్న మూడు ఎకరాల సొంత పొలంతో పాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నా. విత్తనాలు, ఎరువుల కోసం ఇప్పటికే ఆర్‌బీకేలో రిజిస్ట్రేషన్ చేసుకున్నాను. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల చెంతకు అన్నీ చేర్చుతుండటం చాలా బాగుంది. – లక్ష్మీనారాయణ, రైతు, కలుగొట్ల, కోవెలకుంట్ల మండలం

సున్నిపెంటకు మహర్దశ

- ఇక పంచాయతీ పాలనలోకి గ్రామం
- 208.74 ఎకరాల్లోని గ్రామం పంచాయతీరాజ్ శాఖకు బదలాయింపు



శ్రీశైలం ప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామ పంచాయతీకి వడివడిగా అడుగులు పడుతున్నాయి. పంచాయతీ పాలనలోకి చేర్చుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 40ను జారీ చేసింది. ఇక నుంచి ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఏర్పడింది. శ్రీశైల ప్రాజెక్ట్ నిర్మాణం మేరకు 1964లో అటవీశాఖకు చెందిన 1,453 ఎకరాల భూములను డీ నోటిఫై చేసి జలవనరుల శాఖకు అప్పట్లో అప్పగించారు. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో ఏ పని చేపట్టాలన్నా జలవనరుల శాఖ అధికారుల అనుమతి తీసుకోవాల్సి వచ్చేది. నిబంధనల మేరకు చాలా పనులు నిలిచిపోయి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు దూరమయ్యాయి. ఈ క్రమంలో 2006లో జీఓ 02 ద్వారా సున్నిపెంటను పంచాయతీగా మార్చుతూ వైఎస్సార్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా 2013 ఏప్రిల్ 26న స్టే విధించారు. ఆరేళ్ల తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019 అక్టోబర్‌లో స్టేను తొలగించింది. అయితే జలవనరుల శాఖ పరిధిలోని భూమిని పంచాయతీ రాజ్ శాఖకు బదలాయించడంలో జాప్యమైంది. దీంతో గ్రామపంచాయతీ విధులకు అడ్డంకులు ఏర్పడ్డాయి. ఏ పనిచేయాలన్నా.. మళ్లీ జలవనరుల శాఖ అధికారుల అనుమతి తప్పనిసరి అయ్యింది. ముఖ్యంగా 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ కింద ఖర్చు చేసేందుకు ఇబ్బందులు తలెత్తాయి. సమస్యను జలవనరుల, రెవెన్యూ, పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. ఈ మేరకు 208.74 ఎకరాల్లో ఏర్పడిన సున్నిపెంట గ్రామ అభివృద్ధిని పంచాయతీ రాజ్ శాఖ చూసుకోవాల్సిందిగా ఈనెల 11వ తేదీన జీఓ నెం. 40 జారీ చేసింది. మిగతా భూముల్లో 719.16 ఎకరాలు వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, దేవాలయాలు, రెవెన్యూ పట్టా భూములు ఉన్నాయి. 306 ఎకరాల స్థలం శ్రీశైలం డ్యామ్ మెయింటెనెన్స్‌లో ఉన్నది. 167 ఎకరాల్లో కొండలు, లోయలు, 400 కేవీ, 200 కేవీ హెచ్‌టీ లైన్లు ఉన్నాయి. మిగతా 68 ఎకరాల్లో జలవనరుల శాఖకు చెందిన కార్యాలయాలు, వర్క్‌షాప్‌లు, ఖాళీ స్థలాలు ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో సున్ని పెంట ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మరో నాలుగు రోజులు నిప్పుల కుంపటే!

- పెరుగుతున్న సూర్య ప్రతాపం

కర్నూలు(అగ్రికల్చర్): సూర్య ప్రతాపం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఎండతో పాటు వడగాలుల తీవ్రత ఎక్కడా నిలవనివ్వని పరిస్థితి నెలకొంది. నెత్తిన నిప్పుల కుంపటి పెట్టుకున్నట్లుగా భానుడు సెగలు కక్కుతున్నాడు. ఎండల తీవ్రత మరో మూడు, నాలుగు రోజులు ఇలాగే ఉండే అవకాశం ఉన్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది.

- ➡ కర్నూలు జిల్లాలోని ఆలూరులో మంగళవారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మధ్యాహ్నం 2 గంటల సమయానికి 43.36 డిగ్రీలు, 3 గంటల సమయానికి 44.43 డిగ్రీలు, నాలుగు గంటల సమయానికి 45.93 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది.
- ➡ నంద్యాల జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయానికి 45.24 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. చాగలమర్రిలో 43.91, గోస్పాడులో 43.6 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 3 గంటల సమయానికి పాములపాడులో 44.65, చాగలమర్రిలో 44.44, గోస్పాడులో 43.75 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంది. 4 గంటల సమయానికి నంద్యాల జిల్లాలో ఎండల తీవ్రత కాస్త తగ్గింది.

మహిళా భద్రతే ప్రథమ లక్ష్యం

- డీఐజీ సెంథిల్ కుమార్

డోన్ టౌన్: మహిళల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీసు శాఖ పని చేస్తున్నట్లు రాయలసీమ డీఐజీ సెంథిల్ కుమార్ అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా మంగళవారం డోన్ డీఎస్పీ కార్యాలయం, రూరల్ పోలీసు స్టేషన్లను ఎస్పీ రఘువీర్ రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. డోన్ డివిజన్‌లో క్రైం రేటు, నేరాలను నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలను సిబ్బందిని అడిగి తెలుసుకుని చర్చించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో ఐదు అంశాలపై ప్రధానంగా దృష్టి సారించగా అందులో మహిళా భద్రతకు ప్రథమ ప్రాముఖ్యత కల్పించినట్లు తెలిపారు. డోన్ డివిజన్‌లో అసాంఘిక కార్యకలాపాల కట్టడికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వారి వెంట డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, డోన్, ప్యాపిలి, బేతంచెర్ల సీఐలు శేషయ్య, శ్రీరాములు, ప్రియతంరెడ్డి, ఎస్ఐలు శరత్‌కుమార్ రెడ్డి, సురేష్, నరేష్, రాకేష్ ఉన్నారు.



డీఎస్పీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఐజీ సెంథిల్ కుమార్

రెండో రోజు ప్రశాంతంగా ఏపీ ఈఏపీ సెట్

కర్నూలు సిటీ: ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ పరీక్ష రెండో రోజు మంగళవారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. కర్నూలు జిల్లాలో 95.22 శాతం, నంద్యాల జిల్లాలో 94.51 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. కర్నూలు జిల్లాకు సంబంధించి కర్నూలు నగరంలో 7 కేంద్రాలు, ఎమ్మిగనూరులో ఒక కేంద్రం ఏర్పాటు చేయగా, ఉదయం సెషన్ పరీక్షలకు 1,041 మందికి గాను, 1,001 మంది, మధ్యాహ్నం సెషన్‌కు 1,046 మందికిగాను 992 మంది హాజరయ్యారు. నంద్యాల జిల్లాలో 4 కేంద్రాల్లో ఉదయం సెషన్‌లో 483 మందికి 458 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 483 మందికిగాను 454 మంది విద్యార్థులు హాజరయ్యారు.

చెస్ సాధనతో మేధస్సు పదును



విజేతలకు షీల్డులు అందజేస్తున్న ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సుధాకర్ తదితరులు



చెస్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి సాక్షి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌కు విశేష స్పందన వచ్చింది. కర్నూలు నగరంలోని స్థానిక ఏ – క్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో వివిధ విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించిన టోర్నమెంట్‌కు కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి పలువురు హాజరై తమ ప్రతిభ చాటారు. పోటీ ఆద్యంతం ఆసక్తిగా సాగింది. ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సుధాకర్, హాఫీజ్ ఖాన్ హాజరై క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

- వివరాలు 8లో▸

ఉత్తమ సేవలకు సత్కారం

19 నుంచి గ్రామ/వార్డు వలంటీర్లకు ప్రశంసా పత్రాలు

- జిల్లాలో 9,161 మంది వలంటీర్లకు సన్మానం
- మండలాలకు చేరిన సర్టిఫికెట్లు, శాలువాలు, బ్యాడ్జీలు, మెడల్స్
- సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర కేటగిరీలుగా విభజన
- జిల్లాలో సేవా వజ్ర అవార్డుకు 38 మంది ఎంపిక.. వీరికి ఒక్కొక్కరికి రూ.30 వేలు







కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు చేరవేయడంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కీలక పాత్ర పోషిస్తున్న వలంటీర్లను సన్మానించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ/వార్డు సచివాలయాలకు, ప్రజలకు వారధిలా పనిచేస్తున్న వీరి సేవలకు గుర్తింపుగా ఈ నెల 19వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని మండలాల్లో సన్మానించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో ఈ కార్యక్రమాన్ని అదే రోజు ప్రారంభించనున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వలంటీర్లు అందిస్తున్న సేవలను గుర్తించిన ప్రభుత్వం సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర కేటగిరీలుగా ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహకంగా నగదును అందించేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలోనే సేవా మిత్రలుగా ఎంపికైన వారికి ఒక్కొక్కరికి రూ.10 వేలు, సేవా రత్నకు రూ.20 వేలు, సేవా వజ్రగా ఎంపికైన వారికి రూ.30 వేలను క్యాష్ రివార్డుగా అందించనున్నారు. ఈ నగదుతో పాటు ఎంపికైన వలంటీర్లందరికీ ప్రశంసా పత్రం, శాలువా, బ్యాడ్జీ, మెడల్స్‌తో సత్కరిస్తారు.



వలంటీర్లకు అందజేసే పతకం

జిల్లాలో 38 మందికి సేవా వజ్ర

జిల్లాలోని కర్నూలు నగరపాలక సంస్థ, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపాలిటీలతో పాటు 25 మండలాల్లో మొత్తం 9,161 మంది గ్రామ/వార్డు వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. వీరిలో అత్యుత్తమ సేవలు అందించిన 38 మంది సేవా వజ్ర అవార్డుకు ఎంపిక కాగా, 160 మందికి సేవా రత్న, 8,963 మంది సేవామిత్రలుగా ఎంపికయ్యారు.

రోజుకు రెండు గ్రామ/వార్డు సచివాలయాల్లో కార్యక్రమం

ఈ నెల 19 నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని రోజుకు రెండు గ్రామ/వార్డు సచివాలయాల్లో నిర్వహించాలని, ఇందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అలాగే కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని సచివాలయాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులను సంప్రదించి వారిని ఆహ్వానించి నెలలోగా పూర్తి చేయాలనే ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థి ఆత్మహత్య


కురువ సాయి తేజ(ఫైల్)

మిడుతూరు: చదువు ఆపేసి ఉద్యోగం చేసి కుటుంబానికి ఆసరాగా ఉండాలని తల్లిదండ్రులు ఒత్తిడి చేస్తున్నారనే మనస్తాపంతో పాలిటెక్నిక్ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ మారుతీశంకర్ తెలిపిన వివరాలు.. కడుమూరు గ్రామానికి చెందిన కురువ రామ్మోహన్, జయలక్ష్మి దంపతుల కుమారుడు సాయితేజ (19) కర్నూలు సమీపంలోని తాండ్రపాడులో ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో రెండో సంవత్సరం డిప్లమా చదువుతున్నాడు. కాగా కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగో లేదని, చదువు మానేసి ఏదైనా ప్రైవేట్ ఉద్యోగం చూసుకుని కుటుంబానికి అండగా ఉండాలని తల్లిదండ్రులు కొంత కాలంగా ఒత్తిడి చేస్తున్నా చదువుకుంటానని చెబుతూ వస్తున్నాడు. అదే విషయమై సోమవారం రాత్రి కూడా కుటుంబ సభ్యుల మధ్య చర్చ జరగడంతో మనస్తాపానికి గురైన సాయితేజ రాత్రి భోజనం చేసిన తర్వాత అప్‌స్టేర్‌లోకి వెళ్లి ఫ్యాన్ పక్కన ఉన్న ఇనుప చువ్వకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం తెల్లవారుజామున తల్లిదండ్రులు గమనించి కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. తండ్రి రామ్మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాముకాటుతో మహిళా కూలీ మృతి


మృతి చెందిన దూదేకుల మాబీ

బనగానపల్లె రూరల్: పాము కాటుతో ఓ మహిళా కూలీ మృతిచెందిన ఘటన మండలంలోని జ్వాలాపురం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన దూదేకుల మాబీ(28) ఉదయం పాతపాడు సమీపంలోని మామిడి తోటలో కాయలు తెచ్చేందుకు కూలీ పనికి వెళ్లింది. మధ్యాహ్నం పనిలో నిమగ్నమై ఉండగా చెట్టు కింద ఉన్న చెత్తలో నుంచి పాము మాబీని కాటు వేసింది. తోటి కూలీలు గమనించిన వెంటనే బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలుకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

కేజీ రోడ్డులో ట్రాఫిక్ జామ్

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు – గుంటూరు రోడ్డులో వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు అవస్థలు పడ్డారు. ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో రావడం, సమీపంలో వంతెన నిర్మాణం చేపడుతుండటంతో ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి. ఎండ వేడిమికి ఉక్కిరిబిక్కిరయ్యారు. ప్రతి మంగళవారం, శుక్రవారం ఇదే పరిస్థితి ఎదురవుతున్నా ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

చెస్ సాధనతో మేధస్సు పదును

- ఏకాగ్రత వల్ల చదువు, క్రీడల్లో విజయం సులువు
- 'సాక్షి' చెస్ ఓపెన్ టోర్నీకి విశేష స్పందన
- పాల్గొన్న కర్నూలు, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి. చిత్రంలో కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ తదితరులు

కర్నూలు(టౌన్): చెస్ సాధనతో మేధస్సు చురుగ్గా పని చేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. స్థానిక ఏ.క్యాంపులోని మాంటిస్సోరి పాఠశాలలో మంగళవారం 'సాక్షి' చెస్ ఓపెన్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ చెస్, పెయింటింగ్, సింగింగ్ తదితర పోటీలు నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న సాక్షి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి క్రీడల వల్ల చిన్నారుల్లో ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. ప్రతి చెస్ క్రీడాకారుడు విశ్వనాథ్ ఆనంద్‌లా తయారవ్వాలన్నారు. క్రీడల వల్ల క్రమ శిక్షణ వస్తుందని, తద్వారా తల్లిదండ్రులు, గురువులు, పెద్దల పట్ల గౌరవభావం అలవడుతుందని చెప్పారు. అంతకు ముందు అండర్-8, అండర్-10, అండర్-12, అండర్-14, అండర్-16, అండర్-18 విభాగాలతో పాటు ఓపెన్ క్యాటగిరిలోను బాలురు, బాలికలకు పోటీలు నిర్వహించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి క్రీడాకారులు 138 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలు ఆద్యంతం ఆసక్తిగా సాగాయి. 6 రౌండ్లలో క్రీడాకారులు పోటీపడ్డారు. ఓపెన్ క్యాటగిరిలో చిన్నారులు సైతం జూనియర్, సీనియర్స్‌తో తలపడ్డారు. విజేతలకు ఎమ్మెల్యేలు హాఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జరదొడ్డి సుధాకర్ బహుమతులు అందజేశారు. పోటీలను నిర్వహించిన ఆంధ్ర చెస్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.రామసుబ్బారెడ్డి, ఆల్ కర్నూలు చెస్ అసోసియేషన్ అధ్యక్షులు గోవిద్ జియ్యర్‌లను ఎమ్మెల్యేలు సత్కరించారు. స్పాన్సర్ కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్‌ను పాణ్యం ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో సాక్షి బ్రాంచ్ మేనేజర్ సతీష్‌రావు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులతో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ సెల్ఫీ

క్రీడలను ప్రోత్సహిస్తున్న సాక్షికి అభినందనలు

పోటీల స్పాన్సర్, కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ మాట్లాడుతూ సాక్షి యజమాన్యం చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తుండటంఅభినందనీయమన్నారు. ఉమ్మడి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొనడం సంతోషించదగ్గ విషయమన్నారు. చెస్ క్రీడ వల్ల క్రమశిక్షణ, మెదడు చురుకుదనం వస్తుందని, చదువుల్లోనూ రాణిస్తారని చెప్పారు. గెలుపోటములతో సహజమని, ఓడిన వారు మరోసారి గెలిచేందుకు యత్నించాలని సూచించారు, తాను స్వతహాగా చెస్ ప్లేయర్‌ను అని, ఇది ఎంతగానో ఉపయోగపడే క్రీడ అని అన్నారు. సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ గేమ్స్ వల్ల జ్ఞాపకశక్తి తగ్గుతుందని, వాటికి దూరంగా ఉండి మేధస్సుకు పదును పెట్టే క్రీడలు ఎంచుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని సూచించారు.

చెస్ ఆడి.. చిన్నారులను ప్రోత్సహించి..

కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ చిన్నారులతో కాసేపు చెస్ ఆడారు. ఎత్తులకు పైఎత్తులు వేస్తూ చిన్నారులను ప్రోత్సహించారు. చిన్ననాటి నుంచే చెస్ క్రీడలో రాణిస్తున్న చిన్నారులను అభినందించారు. క్రీడ మంచి భవిష్యత్ ఉన్న క్రీడ అని బాగా రాణించాలని సూచించారు.


పోటీలో పాల్గొన్న చిన్నారులు

విజేతలు వీరే..


ఓపెన్ కేటగిరీ బాలుర విభాగంలో..
ఆర్.కార్తికేయ (మొదటిస్థానం), పి.హర్షిత్ (రెండవ స్థానం), పి.లోక్షిత్ (మూడవ స్థానం), ఏ.రోహిత్ కుమార్ (నాలుగవ స్థానం), డి.చిరదీప్‌రెడ్డి (ఐదవస్థానం).
బాలికల విభాగంలో..
పి.దీపిక (మొదటిస్థానం), జి.నిత్యశ్రీ (రెండవ స్థానం), యం. సహస్రా లక్ష్మి (మూడవ స్థానం), సాన్వి రెడ్డి (నాలుగవ స్థానం), డి. అమృత (ఐదవస్థానం).
- అండర్-8 బాలుర విభాగంలో ఎస్.అచ్యుత్‌రామ్ (ప్రథమస్థానం), కె.వేదాన్ష్ (ద్వితీయ స్థానం), బాలికల విభాగంలో జి.లహిత (ప్రథమస్థానం), యం.లలిత్య (ద్వితీయ స్థానం).
- అండర్-10 బాలుర విభాగంలో వై.వీరభద్ర భరద్వాజ్ (ప్రథమస్థానం), యం.శివకార్తికేయ (ద్వితీయ స్థానం), బాలికల విభాగంలో జి.షాలినీ (ప్రథమ స్థానం), వై.వీక్షిత (ద్వితీయ స్థానం).
- అండర్-12 బాలుర విభాగంలో జి.రిత్విక్ (ప్రథమస్థానం), హిమతేజ (ద్వితీయ స్థానం), బాలికల విభాగంలో ఎస్.కీర్తన సాయి (ప్రథమస్థానం), జి.హిమకీర్తి (ద్వితీయ స్థానం).
- అండర్-14 బాలుర విభాగంలో ఎస్.ఆరవింద్ (ప్రథమ స్థానం), జె.సాయిలోకేష్ (ద్వితీయ స్థానం), బాలికల విభాగంలో పి.గీతిక (ప్రథమస్థానం), డి.చాహత్ (ద్వితీయ స్థానం).
- అండర్-16 బాలుర విభాగంలో జి.రామ్ సందీప్ (ప్రథమ స్థానం), యస్.గుణకర్ శ్రీ ఆసిత్ (ద్వితీయ స్థానం).

21న శతాధిక కవి సమ్మేళనం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఈనెల 21న సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో శతాధిక కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు వేదిక జిల్లా అధ్యక్షులు డి.కేశవయ్య తెలిపారు. మంగళవారం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను వేదిక గౌరవాధ్యక్షులు నరహరి నారాయణరెడ్డి, జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ కర్నూలు అధ్యక్షులు కరణం కిషోర్‌కుమార్, డీసీడీఆర్‌సీ సభ్యులు నజీమా కౌషర్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డి.కేశవయ్య మాట్లాడుతూ శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో సమ్మేళనం జరుగుతుందన్నారు. తెలుగు భాష వైభవాన్ని చాటుతూ కవులను, రచయితలను ప్రోత్సహించేందుకు కళా వేదిక పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మహిళా కార్యదర్శి మళేకర్ నాగజ్యోతి, సభ్యులు సువర్ణ జోషి, నాగశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం కేసులో పాత నేరస్తుడి అరెస్టు


దుద్దెర లింగం

కర్నూలు: స్థానిక దేవనగర్ కేసీ కెనాల్ వద్ద అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో మూడవ పట్టణ పోలీసులు నిఘా వేసి పాత నేరస్తుడు దుద్దెర లింగంను అరెస్టు చేసి కటకటాలకు పంపారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధిపేట జిల్లా కొండపాక మండలంకు చెందిన ఈయన ప్రస్తుతం నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం బుగ్గానిపల్లె గ్రామంలో ఉంటున్నాడు. ఇతను గతంలో మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రెండు దొంగతనం కేసుల్లో అరెస్టయి జైలుకు వెళ్లి ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చాడు. పొరుగు రాష్ట్రం చెందిన తెలంగాణకు చెందిన మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో నిఘా వేసి అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఆరు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తబ్రేజ్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని మృతదేహం

గూడూరు: మండల పరిధిలోని సుంకేసుల వద్ద తుంగభద్ర నదిలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ పీరయ్య తెలిపారు. రోజ్ కలర్ షర్ట్, బ్లూ కలర్ ప్యాంట్ వేసుకున్నాడని, 39 ఏళ్ల వయస్సు ఉండవచ్చని తెలిపారు. వివరాలు తెలిస్తే 9121101072 సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

భారత సెపక్‌తక్రా శిక్షణ శిబిరానికి జిల్లా వాసి ఎంపిక


శివకుమార్‌ను సత్కరిస్తున్న సీఈఓ రమణ తదితరులు

కర్నూలు (టౌన్): గోవాలో నిర్వహిస్తున్న భారత సెపక్‌తక్రా శిక్షణ శిబిరానికి కర్నూలుకు చెందిన క్రీడాకారుడు శివకుమార్ ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ తరపున భారత శిక్షణ శిబిరానికి ఎంపికై న యువకుడిని మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ సీఈఓ రమణ తన చాంబర్‌లో సత్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భారత జట్టుకు రాష్ట్రం తరపున పాల్గొని బంగారు పతకాన్ని సాధించిన శివకుమార్ మరోసారి జాతీయ శిక్షణ శిబిరానికి ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర సెపక్‌తక్రా సంఘం కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ జాతీయ స్థాయి శిక్షణలో కర్నూలు క్రీడాకారులు మూడు సార్లు ఎంపిక కావడం జిల్లాకే గర్వకారణమన్నారు. ఈనెల 13 నుంచి 30 రోజుల పాటు క్యాంప్ కొనసాగుతుందని, అనంతరం ఏషియన్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనే భారత జట్టుకు ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ నటరాజరావు, ఒలంపిక్ అసోసియేషన్ సీఈఓ విజయ్‌కుమార్ నిర్వహణ కార్యదర్శి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి సెబ్ పోలీసుల చేయూత


సెబ్ జేడీ చేతుల మీదుగా కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న సహోద్యోగులు

కర్నూలు: జిల్లా పోలీసు శాఖలో 2011 బ్యాచ్ కానిస్టేబుల్ ఎస్.అన్సర్‌బాషా కర్నూలు ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఉంటూ డిప్యుటేషన్‌పై జిల్లా సరిహద్దు పంచలింగాల సెబ్ చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తూ మే 11వ తేదీ రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బాధిత కానిస్టేబుల్ కుటుంబాన్ని ఆదుకునేందుకు సెబ్ పోలీసులు తమ వంతు సాయంగా సేకరించిన రూ.1.35 లక్షల నగదును మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సెబ్ జేడీ కృష్ణకాంత్ పటేల్ చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆఫీసర్స్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్ అండ్ హెడ్‌కానిస్టేబుల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓబులేసు, సెబ్ సీఐలు జయరామ్ నాయుడు, సత్యనారాయణ, శేషాచలం, కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగన్నాథం, మీడియా కార్యదర్శి వెంకట్రాముడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


విజయ్ (ఫైల్)

గడివేముల: మండలంలోని గని గ్రామ సమీపంలో ఉన్న సోలార్ పార్కు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. నందికొట్కూర్ మండలం 10 బొల్లవరం గ్రామానికి చెందిన విజయ్ ద్విచక్ర వాహనంపై గనికి బయలుదేరాడు. సోలార్ పార్క్ సమీపంలోకి చేరుకోగానే పంక్చర్ దుకాణం వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


శ్రీనివాసులు(ఫైల్)

ఓర్వకల్లు: చేపల వేటకు వెళ్లి సోమవారం బయన్న స్వామి చెరువులో ప్రమాదశాత్తూ నీట మునిగి గల్లంతైన వ్యక్తి మంగళవారం ఆచూకీ లభ్యమైంది. కర్నూలు అగ్నిమాపక సిబ్బంది ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కల్లూరు మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన తెలుగు శ్రీనివాసులు(50), తడకనపల్లెకు చెందిన వడ్ల మాబు సోమవారం చేపల కోసం ఓర్వకల్లు మండలం బైరాపురం సమీపంలోని బయన్నస్వామి చెరువుకు వెళ్లారు. చేపల కోసం వల వేసి కొద్దిసేపు ఒడ్డున కూర్చున్నారు. చేపలు పడ్డాయని గమనించి శ్రీనివాసులు చెరువులోకి దిగాడు. ఈక్రమంలో ప్రమాదశాత్తూ నీటిలో ఉన్న కంపచెట్ల మధ్యన మునిగిపోయాగాడు. వడ్ల మాబుకు ఈత రాకపోవడంతో కుటుంబ సభ్యలకు సమాచారం చేరవేశాడు. వారు అక్కడికి చేరుకుని గాలించినా లాభం లేకపోయింది. దీంతో ఓర్వకల్లు పోలీసులు మంగళవారం ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందిని రప్పించి ఇంజిన్ బోటుతో ఐదు గంటల పాటు శ్రమించి మృతదేహాన్ని వెలికితీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు శ్రీనివాసులుకు భార్య రామేశ్వరమ్మతో పాటు, శేఖర్, వెంకటేష్ ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశెనగ	3,398	7,699
పొద్దుతిరుగుడు	2,869	2,869
ఆముదం	5,189	5,329
వాము	5,550	23,950
ఎండు మిర్చి	4,099	17,309
శనగలు	4,269	4,309
కందులు	3,700	8,050
మొక్కజొన్న	1,619	1,810

ANDHRA PRADESH SOLAR POWER CORPORATION PVT LTD
(A Joint venture company of Government of A.P and Government of India)
e - Procurement Tender Notice
APSPCL invites tender for the work of "Construction of Cement Concrete Causeways across in Storm water drain which is passing through Solar park lands in Sekunala and Gani villages of Orvakal and Gadivemula Mandal of Kurnool and Nandyal District. A.P. Approximate Value of Work Rs 25.27 Lakhs. Schedule Available Date & Time: 16.05.2023 from 05.00 P.M. For details visit: www.apspcl.ap.gov.in (or) www.apeprocurement.gov.in

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

ADMISSIONS

PARAMEDICAL
■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1419]

REAL ESTATE

FLAT FOR SALE
■ ఓర్వకల్లు–శకునాల సోలార్ పార్కు ప్రక్కన 30x40 (2.75 సెంట్లు) ఓపన్ ప్లాట్లు అమ్మకానికి కలవు. సెంటు 1.10 లక్షలు మాత్రమే. సంప్ర: నితిక డెవలపర్స్ 98884 24222 [L-798985]
■ కర్నూలు–బెంగుళూరు హైవే మెయిన్ రోడ్‌కు అనుకొని KUDA/RERA అప్రూవల్స్ కల్గిన 3 సెంట్ల ప్లాటు కేవలం రూ. 7,95,000/- లకే, 2.75 సెంట్ల ప్లాటు కేవలం రూ. 4,50,000/- లకే. EMI సదుపాయం కలదు. సంప్ర: AMAZON Resorts వెల్దుర్తి, సెల్: 7778883624 [L-027]

PLOT FOR SALE
■ 7 లక్షలకే 25 సెంట్ల భూమి 100 ఎర్ర చందనం మొక్కలతో, 10 సం॥లలో కోట్ల ఆదాయం, మీ పిల్లల భవిష్యత్‌కు బంగారు బాట వేసే సదవకాశం, ఒక పెట్టుబడి రెండు లాభాలు. సంప్రదించగలరు ✆ 99893 17616 [B-2349]

SHOP FOR SALE
■ మినీ సూపర్ మార్కెట్ రన్నింగ్‌లో వున్నది అమ్మబడును. కర్నూలు ధర్మపేట, దీపక్‌తేజ్ హాస్పిటల్ దగ్గర స్టాక్‌తో సహా (బిల్డింగ్ కాదు) అమ్మబడును. 91820 12969, 99124 44244 [L-798992]

TO - LET
■ కర్నూలు నందికొట్కూరు రోడ్డులో వార్త ఆఫీస్ ఎదురుగా, మారుతినగర్ 3rd ఫ్లోర్ నందు తూర్పు ముఖం, కార్ పార్కింగ్ కల్గిన 2BHK హౌస్ అద్దెకు ఇవ్వబడును. ఫోన్: 80198 73081 [L-622]

SERVICES
■ అతి సులభంగా రుణాలు పొందండి. వ్యాపారం ప్రాపర్టీ మార్క్ షీట్ వ్యక్తిగత LIC వ్యవసాయ భూమిపై తక్కువ దస్తావేదులతో పొందండి. 9505973750, 8096532189. [T-70]

బంగారం కొనబడును
■ మీ బంగారం, వెండి, డైమండ్స్, బ్యాంక్ / ఫైనాన్స్‌లో తాకట్టు వున్నవి, మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్ ట్రేడింగ్ కం. 73821 14647 [V-6131]

BUSINESS OFFER
■ ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agents గా కావలెను. ఫోన్ : 9034424384. [H-797632]

WANTED
■ ధనలక్ష్మి సీడ్స్ ప్రైవేట్ లి॥ రాఘవేంద్ర నగర్ (రావూరి గార్డెన్స్), కర్నూలు నందు పనిచేయుటకు Tally లో అనుభవం గల వారు (M/F) కావలెను. జీతం: 8,000/- నుండి 20,000/- వరకు. సంప్ర: 94406 55739 [L-799433]
■ Wanted sales Girl, Fresher/ experience, salary : 7500 + contact : Aadil collections, Abdullakhan estates, kurnool. 80741 83760 [L-799442]
■ SSC/INTER/డిగ్రీ/ITI, డిప్లొమా (P/F) అయ్యి ఖాళీగా వున్న 39 స్త్రీ/పురుషులు కావలెను. జీ. 13 వేలు + DA 6 వేలు + బోనస్ + ఫ్రీ రూం. OPP: శ్రీనివాస టాకీస్, కల్లూరు రోడ్, కర్నూలు. 95502 50229 [L-799439]
■ SBI లైఫ్ ఇన్సూరెన్స్ నందు పని చేయుటకు నియామకాలు జరుగుచున్నవి. వ్యాపారస్తులు, డిస్ట్రిబ్యూటర్స్, రిటైర్డ్ ఎంప్లాయిస్, టీచర్స్, రియల్ ఎస్టేట్ పర్సన్స్ సం॥ 91772 70900 [L-798993]
■ మా కంపెనీ LED బల్బులు మీ ఇంటివద్దనే ఉండి ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000- 20,000/- వరకు సంపాదించండి. వివరాలకై సంప్ర: 7989951063 [G-786311]
■ నేత్ర హోమ్‌కేర్ సర్వీసెస్: Hydలో పెద్ద వారికి, వృద్ధులకు సేవ చేయుటకు బేబీకేర్, ఇంటి/వంటపనికి స్త్రీ/పు॥ కావలెను. జీతం: 15000 to 25000. రూం+ భోజనం ఫ్రీ ✆ 9676917002, 9908912806 [G-584]
■ కొత్తగా ప్రారంభించిన మా కంపెనీలో 28 మంది స్త్రీ/పురుష ఉద్యోగాలు. జీతం: 13000 + బోనస్ 6000 + రూమ్ & ఫుడ్ ఫ్రీ. అర్హత : SSC to డిగ్రీ (పాస్/ఫెయిల్). సంప్ర: Govt హాస్పిటల్ దగ్గర, HDFC బ్యాంక్ ఎదురుగా, నంద్యాల. 9618511680. [A-7538]
■ DHL International Cargo Courier Servicesలో వర్క్ చేయుటకు క్యాబిన్ క్రూ లోడింగ్ full సర్వీసెస్, Office Admin Supervisors, Ground Staff, Team Leaders కావలెను. Q: 10th to any Degree , డిప్లొమా ITI, Age: 18 to 35, Food + Room free. Salary: 25,000/- to 32,000/- Ph: 81255 60645 [B-1165153]
■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం: 15000+ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786210]
■ Wanted receptionist @ abdullakhan estate, kurnool. salary 7000 - 10000 + weekly holiday immediate joining. contact : 90525 07754, 89190 93026 [L-798994]
■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను.ఆయా,వార్డ్ బాయ్స్ ,నర్సులు, వంటవారు, RMP. Dr. Q:5th- డిగ్రీ, 10-30వేలు జీతం. భో+రూం ఫ్రీ. Hyd. 7993583999 [HA-165]
■ లేపాక్షి హెల్త్‌కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18K ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్ : 9640400073 [HA-181]
■ ప్రముఖ బ్యాంకు నందు పని చేయుటకు డిగ్రీ అర్హత కల CSO, క్లర్క్, క్యాషియర్, బ్యాంక్ ఆఫీసర్ అర్జెంటుగా కావలెను. (M/F) ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో సంప్రదించండి. 90630 09249. [NA-10557]
■ గ్లోబల్ సర్టిఫైడ్ కంపెనీ నందు గొప్ప అవకాశం. ఇంటివద్ద చేస్తూ నెలకు 20 వేలు పైన సంపాదన. నిరుద్యోగులు, గృహిణులు, 18+ అందరూ అర్హులే. ✆ 89787 74595 [B-0104]
■ మార్కెటింగ్: ఒక ప్రముఖ ఒక రెడ్ శాండిల్ ఫాం ప్రాజెక్ట్ నందు మార్కెటింగ్ చేయుటకు ఉత్సాహవంతులైన యువకులు కావలెను. ప్రాజెక్ట్ ఏరియా కనిగిరి. సీనియర్స్ కి క్యాడర్ వైజ్ ప్రమోషన్స్ & ఇన్సెంటివ్స్ మంచి కెరీర్ ఉండును. PH: 7013276170. [C-1161008]
■ కర్నూలు- ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామంలో సర్వే నెం. 366-2 లో 1 ఎకరం పొలం అమ్మబడును. ఖాతానెం.703. పోరంబోకు బండి రస్తా కలదు. విమానాశ్రయానికి అతి చేరువలో నేషనల్ హైవే ప్రక్కన 2వ బిట్ ధర 2.5 కోట్లు. బేరసారాలకు సంప్రదించగలరు: 98481 16326 [L-798995]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పెద్దాసుపత్రిలో ఇష్టారాజ్యంగా పనులు

- హెచ్‌డీఎస్ సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆగ్రహం


మాట్లాడుతున్న ఎంపీ సంజీవకుమార్, చిత్రంలో కలెక్టర్ సృజన, ఎమ్మెల్యేలు కాటసాని, హాఫీజ్‌ఖాన్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, అడ్డదిడ్డంగా పనులు చేపడుతున్నారని, ప్రజాప్రతినిధులతో పాటు ఎవ్వరినీ లెక్కచేయడం లేదని కర్నూలు ఎంపీ డాక్టర్ ఎస్.సంజీవకుమార్, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హాఫీజ్‌ఖాన్, డాక్టర్ జరదొడ్డి సుధాకర్ మండిపడ్డారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధి సొసైటీ సమావేశం మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన అధ్యక్షత వహించిన సమావేశంలో ముందుగా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీరింగ్ అధికారులు నిర్వహిస్తున్న పనులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక భవనం నిర్మిస్తున్నప్పుడు దానిని ఎందుకు కడుతున్నామో తెలియకుండా కడితే ఎలాగని ప్రశ్నించారు. ఆసుపత్రిలో బాత్‌రూమ్‌లకు వెళితే లేని రోగాలు వచ్చేలా ఉన్నాయన్నారు. మార్కెట్‌యార్డుకు ఒక వైద్యున్ని నియమిస్తే అక్కడికి వచ్చే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని కోరారు.

→ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ ఆసుపత్రిలో అన్ని సమస్యలకు మూలం ఏడీ రమేష్‌బాబు అని ఆరోపించారు. ఆసుపత్రిలో జరుగుతున్న నిర్మాణపనులపై విజిలెన్స్ విచారణ జరిపించాలని కోరారు.

→ జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన మాట్లాడుతూ ఆసుపత్రిలో సీసీ కెమెరాలను తిరిగి పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా విభాగాల్లో డాక్టర్‌తో పాటు ఎవరు ఎప్పుడు వచ్చారు, ఎంత సమయం ఉన్నారో అన్ని వివరాలు రికార్డు కావాలని ఆదేశించారు.

→ కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ ఇటీవల ప్రారంభించిన డయాగ్నొస్టిక్ సెంటర్‌కు తనను పిలవలేదని, శిలాఫలకంపై తన పేరు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులై ఉండి ప్రొటోకాల్ పాటించకపోతే ఎలాగన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ మార్చురీలో పనిచేసే బాయ్స్‌కు కనీస వేతనం ఇవ్వాలని కోరారు.


హాజరైన అధికారులు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగుల పనితీరు అధ్వానంగా ఉందని, డీఎంహెచ్ఓ మాటను సైతం ఖాతరు చేయడం లేదని ఎమ్మెల్యేలు అభిప్రాయం వ్యక్తం చేశారు. సమావేశంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, మున్సిపల్ కమిషనర్ భార్గవతేజ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

→ కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవకుమార్ మాట్లాడుతూ ఇంజినీరింగ్, ఆసుపత్రి అధికారులకు ప్రజాప్రతినిధులను కలిసే అలవాటు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను కలిసి ఏవైనా సమస్యలు విన్నవిస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. తన కృషి వల్లే ఐదు సూపర్‌స్పెషాలిటీ విభాగాల్లో పీజీ సీట్లు మంజూరయ్యాయని ఆయన గుర్తు చేశారు. ఇటీవల 187 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు కూడా మంజూరు చేయించామన్నారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్లాంట్ ద్వారా విద్యుత్‌ను అధిక ధర రూ.6.49 పైసలు చెల్లించి కొనుగోలు చేస్తున్నారని, బహిరంగ మార్కెట్‌లో తక్కువగా లభిస్తున్నప్పటికీ అంత ఎందుకు చెల్లిస్తున్నారన్నారు. ఆసుపత్రిలో పారిశుధ్య పనులకు నెలకు రూ.72 లక్షలు వెచ్చిస్తున్నారని అయినా పారిశుధ్యం సరిగ్గా లేదని అసహనం వ్యక్తం చేశారు. పెస్ట్‌కంట్రోల్ నిర్వహణకు నెలకు రూ.5.17లక్షలు చెల్లిస్తున్నారని, అయినా పనులు సరిగ్గా లేవన్నారు. లేడీస్ హాస్టల్‌లో భద్రత కరువైందని పలువురు అమ్మాయిలు తనకు ఫిర్యాదు చేశారన్నారు. సెక్యూరిటీ కోసం నెలకు రూ.35 లక్షలు చెల్లిస్తున్నా 185 మందిలో 60 మంది కూడా ఉండటం లేదని ఆరోపించారు. ఆక్సిజన్‌కు ఇక్కడ ఒక యూనిట్‌కు రూ.35లు చెల్లిస్తున్నారని, అదే వైజాగ్‌లో రూ.20లే ఉందని, ఇందులో భారీ ఎత్తున అవినీతి జరుగుతోందని విమర్శించారు. కోవిడ్ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటిలేటర్లు పంపితే అప్పటి అధికారి వాటిని ఓ గదిలో ఉంచి తాళం వేశారని, ఆక్సిజన్ పైప్‌లైన్లు ప్రెజర్ తక్కువ వచ్చేటట్లు నిర్మాణం చేయడం వల్ల అనేక మంది రోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఏబీహెచ్ అక్రిడియేషన్ కోసం రూ.14 కోట్లు ఖర్చు చేశారని, ఇందులో భారీగా నిధులు దుర్వినియోగం చేశారని మండిపడ్డారు.